


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 357, పేజీలు - 08

బుధవారం, జూన్ 17, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# రైతు వేదికల్లో విత్తనాలు, యూరియా

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతులు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు.**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**దతెలంగాణలో వానాకాలం వరిసాగుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా వరి సాగుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు పూర్తిగా అవగాహన ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోని రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సన్న వడ్లు పండించే అన్నదాతల వివరాలను సేకరించాలని వ్యవసాయ శాఖకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. రైతులకు బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను రైతులు మరింతగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే వ్యవసాయ శాఖలో మరింతగా టెక్నాలజీని వినియోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వాడుకుని మరింత అప్‌గ్రేడ్ కావాలని సూచించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకుని టెక్నాలజీని పెంచుకోవాలని తెలిపారు. విత్తనాల దగ్గరి నుంచి పంట కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ కలిసి సమన్వయంతో పనిచేయాలని హితవు

2లో..



### సువేందు అధికారిపై

# మమత న్యాయపోరాటం

## - భవానీపూర్ ఫలితంపై పిటిషన్



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** బెంగాల్లో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ దెబ్బకు ఓవైపు తృణమూల్ కాంగ్రెస్ కుదేలవుతోంది. అంతర్గత తిరుగుబాట్లతో చీలిక దిశగా పయనిస్తోంది. అధికారికంగా టీఎంసీ మమతా బెనర్జీ చేతుల్లో ఉండే అవకాశాలు కూడా కనిపించడం లేదు. వేరు కుంపటి పెట్టుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు రేపు తమదే అసలైన టీఎంసీ అని కోర్టుకెక్కేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో సీఎం సువేందు అధికారిపై మమతా బెనర్జీ కోల్ కతా హైకోర్టును ఆశ్రయించారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ సీటు నుంచి పోటీ చేసి సువేందు అధికారి చేతిలో ఓటమిపాలైన మమతా బెనర్జీ ఈ ఫలితాన్ని సవాల్ చేస్తూ కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం ఈ కేసు విచారణకు మమత స్వయంగా హాజరయ్యారు. ఈ కేసును మమతకు విధేయుడైన తృణమూల్ ఎంపీ, లాయర్ కళ్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. విచారణపై కళ్యాణ్ బెనర్జీ స్పందించారు.

సువేందు అధికారి ఎన్నికను సవాలు చేస్తూ మమతా బెనర్జీ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను ధృవీకరించడానికి ఆమె మంగళవారం కలకత్తా హైకోర్టుకు వచ్చారని కళ్యాణ్ బెనర్జీ తెలిపారు

2లో..

# మెట్రో లోన్ ఆగిన విషయమే తెలియదు

## - రేవంత్ ఆరోపణలపై కిషన్ రెడ్డి ఘాటు కౌంటర్

- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న కిషన్‌రెడ్డి
- మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య
- అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి
- దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ నిధుల నిలిపివేత వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా కాక రేపింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ఇవ్వాల్సిన రూ. 13,600 కోట్ల లోన్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం చేసిన సంచలన ఆరోపణలకు మంగళవారం కిషన్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును ఆపాలని తానేందుకు చెబుతానని, తన వల్లే కేంద్ర ప్రాజెక్టులు

2లో..



### కేంద్ర జలశక్తి మంత్రితో

# పవన్ భేటీ

## - 'సూరత్ నమూనా'పై కీలక చర్చ!



**న్యూఢిల్లీ/ అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఈరోజు ఆయన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాగునీటి ఎద్దడి, కలుషితమవుతున్న నదుల పరిరక్షణ, జల్ జీవన్ మిషన్ అమలు వంటి కీలక అంశాలపై

2లో..

# సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్

- సింగపూర్‌లో వరల్డ్ సిటీస్ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సరికొత్త ఆలోచనలతో అమరావతికి రావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- అభివృద్ధికి, సంపద సృష్టికి సైబరాబాద్ నిదర్శనమని వ్యాఖ్య
- ప్రజా రాజధానిగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని వెల్లడి

**సింగపూర్ / అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అవకాశాల గనిగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సరికొత్త ఆలోచనలతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. సింగపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో భాగంగా తన పర్యటన రెండో రోజు ఆయన 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్లీనరీలో ప్రసంగించారు. అమరావతిని ఒక ప్రజా రాజధానిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని కేవలం పరిపాలనా నగరంగా కాకుండా, ఒక నాలెడ్జ్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు వస్తున్నాయని చంద్రబాబు వివరించారు. క్రీడలు, ఆర్థిక, విజ్ఞానం, న్యాయ, పర్యాటక, ఆరోగ్యం, మీడియా వంటి థీమ్ లతో అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ మౌలిక వసతులు దీనికి ప్రత్యేకతను తెస్తాయని పేర్కొన్నారు.

21 కిలోమీటర్ల కృష్ణా నది తీరం వెంబడి వాటర్ ఫ్రంట్ సిటీగా, ఇన్నర్-ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ వంతెనలతో అమరావతి అద్భుతంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, భూగర్భ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో ఉద్గారాల

2లో..





# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్

## - గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీష్ రావు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, ట్రైల కోసం రూ. 1,200 కోట్లు ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

2లో..

### భారీగా పెరిగిన

# ఢిల్లీ జనాభా

- సెన్సస్ 2027 తొలి దశలో 2.3 కోట్లు దాటిన ఢిల్లీ జనాభా
- 2011తో పోలిస్తే 15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు
- ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల మంది జనాభా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో

2లో..

# ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు

## - కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం

2లో..

### పాక్ ప్రేరేపిత ఉగ్రముఠా

# గుట్టురట్టు

## - ఏడుగురిని అరెస్ట్ చేసిన స్పెషల్ సెల్ పోలీసులు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నమైంది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఒక ఉగ్రవాద-నేరపూరిత ముఠా

2లో..

### హైదరాబాద్ రోడ్లపై ఆగని

# 'గలీజ్ దందా'

## - సీపీ సుమతి రంగంలోకి దిగినా మారని తీరు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో రాత్రిపూట రోడ్లపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఇటీవల మల్కాజిగిరి సీపీ సుమతి స్వయంగా కీలక ఆపరేషన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆమె అర్ధరాత్రి పూట దిల్‌సుఖ్‌నగర్‌లో సాధారణ మహిళ వేషంలో బస్టాండ్‌లో నిలబడగా ఏకంగా 40 మంది పోకిరీలు ఆమెను చుట్టుముట్టి వస్తావా, నీ రేటెంత అంటూ వేధింపులకు గురి చేశారు. దీంతో సీపీ సుమతితో వచ్చిన పోలీసులు దూరంగా ఉండి వీడియోలు రికార్డ్ చేసి ఆ

2లో..

# భారత్‌లో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

## - జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా యాప్‌ను బ్లాక్ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై భారత్‌లో తాత్కాలిక నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా ఈ యాప్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేసింది. పరీక్షల్లో అక్రమాలు, తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సుల మేరకు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000, సెక్షన్ 69ఏ కింద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల ఫలితంగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తొలగించారు. యాపిల్ యాప్ స్టోర్‌లో కూడా ఈ యాప్‌ను తాత్కాలికంగా అందుబాటులో లేకుండా




చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనితో పాటు, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను నిలిపివేయాలని సూచించింది. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ, పేపర్ లీక్ అయినట్లు కృత్రిమ ఆధారాలు సృష్టిస్తున్న ఉదంతాలను దృష్టిలో

2లో..

# కర్ణాటకలో దారుణం

## – ఆస్పత్రిలోను భర్తకు విషం

కర్ణాటకలోని బెళగావి జిల్లాలో జరిగిన ఒక మాజీ సైనికుడి మృతి కేసు సంచలనం సృష్టిస్తోంది. సాధారణ బైక్ ప్రమాదంగా భావించిన ఈ ఘటన రూ.2 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బు కోసం భార్య, ఆమె ప్రియుడు కలిసి పన్నిన దారుణ హత్యగా పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో మృతుడి భార్య, ఆమె ప్రియుడితో పాటు వైద్యులు, ఫోరెన్సిక్ సిబ్బంది సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.మాజీ సైనికుడు సందీప్ మంజర్గి మార్చి 13న బైక్‌పై నుంచి జారిపడి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అతని భార్య సుమ మంజర్గి, మొదట హుక్కేరి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఘటప్రభలోని జేజీ ఆసుపత్రికి మార్చింది. అయితే, మార్చి 15న సందీప్ గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బీఐఎంఎస్ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక ఫోరెన్సిక్ నివేదికలో కూడా ఎలాంటి విష ప్రయోగం జరగలేదని, గుండెపోటు వల్లే మరణం సంభవించిందని పేర్కొన్నారు.ప్రమాదంలో తీవ్ర గాయాలు కాకపోవడం ఆరోగ్యంగా ఉన్న సందీప్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంపై పోలీసులకు అనుమానం కలిగింది. ఈ క్రమంలో సుమ ప్రియుడుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుండలీక్ దొంబార్ పెట్టిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ కేసును కీలక మలుపు తిప్పింది. "ప్రమాదానికి గురైన వ్యక్తి అకస్మాత్తుగా ఎలా చనిపోయాడు?" అంటూ తనకు అంతా తెలిసినట్లుగా అతను పోస్ట్ పెట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర మొత్తం బయటపడింది.పోలీసుల కథనం ప్రకారం సందీప్, పుండలీక్ గతంలో కలిసి హోటల్ వ్యాపారం చేశారు. ఈ క్రమంలోనే సందీప్ భార్య సుమతో పుండలీక్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదే సమయంలో సందీప్ పేరు మీద మూడు వేర్వేరు కంపెనీల నుంచి సుమారు రూ.2 కోట్ల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నారు. ఆ డబ్బును కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు గుర్తించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సుమ, పుండలీక్ కలిసి సెలైన్ బాటిల్ ద్వారా విషాన్ని, నిద్రమాత్రలను ఇచ్చి సందీప్‌ను హత్య చేశారు. అనంతరం ఈ హత్యను గుండెపోటుగా చిత్రీకరించేందుకు వైద్య, ఫోరెన్సిక్ సిబ్బందికి రూ.3 లక్షలకు పైగా లంచం ఇచ్చి నివేదికలను తారుమారు చేయించారు. నిందితుల నుంచి విషం సీసాలు, సిరంజిలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సందీప్ భార్య సుమ, ప్రియుడు పుండలీక్‌తో పాటు డాక్టర్ బసవరాజ్, ఎఫ్‌డీఏ అధికారి అశోక్, ఎఫ్ఎస్ఎల్ క్లర్క్ అప్పాసాహెబ్ సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేశారు.ఇటీవల తెలంగాణలోని కామారెడ్డి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. అక్కడ కూడా భర్తను హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి ఇన్సూరెన్స్ డబ్బు పొందాలని చూసిన భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే

# బెజవాడలో చీపురు పట్టిన కేంద్రమంత్రి

**విజయవాడ** విజయవాడ వన్‌టౌన్‌లోని వాజ్‌పేయి పార్క్‌లో నిర్వహించిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టి పార్క్ పరిసరాలను శుభ్రం చేసిన ఆయన.. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరిలతో కలిసి మొక్కలు నాటారు. అక్కడి వాకర్స్‌తో 'చాయ్ పే చర్చ' జరిపి మోదీ ప్రభుత్వ విజయాలను వివరించారు.ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం, అభివృద్ధికి కేంద్రం సంపూర్ణంగా కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 15,000 కోట్లు కేటాయించామని, హడ్కో ద్వారా మరో రూ. 11,000 కోట్లు అందించామని వెల్లడించారు. అమరావతికి ప్రత్యేక రైల్వే లైన్‌తో పాటు అత్యుత్తమ రోడ్డు కనెక్టివిటీని పెంచుతున్నట్లు చెప్పారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా దేశంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ ఏకంగా 8 రెట్లు పెరిగిందని గుర్తుచేశారు.

# ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలి

## – వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కొర్ర సీతారాం



**అరకులోయ** అరకులోయ పట్టణం లో వినియోగదారుల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ హోటల్లలో టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలు నాణ్యత పాటించాలని సూచించారు ఆహార పదార్థాలు తయారీ నిలువ నమ్మకం నాణ్యత పాటించాలని ఫుడ్ సేఫ్టీ ప్రతి ఒక్క హోటల్ యాజమాన్యం లైసెన్స్ కలిగి ఉండాలని జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కొర్రా సీతారం హెచ్చరించారు హోటల్లలో టిఫిన్ సెంటర్ లలో నాణ్యమైన భోజనం అందించాలని హోటల్ యజమానియాలకు కోరారు ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కమిటీ అధ్యక్షులు చెడ్డ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు

# 12 ఏళ్లలో ఎమ్మెల్యే చేయలేనిది..

# బీజేపీ కృషితో 4 కోట్ల స్కూల్ నిర్మాణం!

- మదీనాగూడా ప్రభుత్వ పాఠశాల పునర్నిర్మాణానికి భూమిపూజ
- విర్టూసా ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధులతో ఆధునిక భవనం
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేత రవికుమార్ యాదవ్ పాల్గొనడం

**శేరిలింగంపల్లి:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడా గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల పునర్నిర్మాణానికి మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. విర్టూసా (ఎతితీబిబీబజీ) ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, కంపెనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సి.ఎస్.ఆర్ నిధులను వినియోగించేందుకు ముందుకు వచ్చిన విర్టూసా ఫౌండేషన్‌ను అభినందించారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "12 సంవత్సరాలుగా స్థానిక ఎమ్మెల్యే చేయలేని పనిని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో బీజేపీ నాయకుల కృషితో సాధించగలిగాం. బీజేపీ మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించే పార్టీ. మదీనాగూడా పాఠశాల పునర్నిర్మాణం ఇందుకు నిదర్శనం" అని అన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరిన్ని సంస్థలు సి.ఎస్.ఆర్ నిధులతో ముందుకు రావాలని ఆయన కోరారు. కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమం సందర్భంగా స్థానిక ప్రజలు మదీనాగూడా పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు కృష్ణ ఎద్దుల, వాసు, ఇందార్, పూజా, సుబ్బారావు, సురేష్ బాబు, అరుణ, కేవీ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జితేందర్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్, విజయేందర్, పద్మ, వినయ, బిందు, శ్రీనివాస్ యాదవ్, మనోజ్, ప్రసాద్ రెడ్డి, శ్రీశైలం కురుమ, పార్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేట నియోజకవర్గంలో

# టీడీపీ మహిళా నేతల వినూత్న నిరసన

**అనకాపల్లి** పాయకరావుపేట నియోజకవర్గంలో టీడీపీ మహిళా నేతలు వినూత్న నిరసన కు దిగారు. ఎస్ రాయవరం మండలం, కోనవానిపాలెం గ్రామంలో మహిళల నిరసన వెల్లువెత్తింది. హోంమంత్రి అనితపై వైసీపీ నేత గుడివాడ అమరనాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, అమరనాథ్ ఫ్లెక్సీని కోడిగుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేసారు. అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు. అమరనాథ్ ఫ్లెక్సీని చెప్పులతో కొట్టారు. మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదు. హోం మంత్రి అనితకు, గుడివాడ అమర్నాథ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు.

# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్

ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

# పాక్ ప్రేరేపిత ఉగ్రముఠా గుట్టురట్టు

గుట్టును ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ రట్టు చేసింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఏడుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. పాకిస్థాన్‌లో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్-టెర్రరిస్ట్ షహజాద్ భట్టి ఆదేశానుసారం ఈ ముఠా పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పంజాబ్ సరిహద్దుల మీదుగా పాకిస్థాన్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను ఈ ముఠా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. రాజధానిలోని రద్దీ ప్రదేశాలు, కీలక సంస్థలు, మత పెద్దల నివాసాల వద్ద వీరు రెక్కీ నిర్వహించి, వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లకు పంపినట్లు విచారణలో తేలింది. ఢిల్లీలో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పన్నిన ఓ భారీ కుట్రను ఈ అరెస్టులతో అడ్డుకున్నామని అధికారులు తెలిపారు.అరెస్టయిన వారిలో అనాస్ త్యాగి, మోహిత్ అలియాస్ యోగి, ఆరిఫ్ అలియాస్ ప్రధాన్, దీపక్ అగ్రోలా, ఆరిఫ్, కరణ్‌వీర్ సింగ్, జతన్, సబీర్ ఉన్నారు. వీరిలో చాలామందికి నేర చరిత్ర ఉంది. నిందితుల నుంచి 5 సె.మీ. ఆటోమేటిక్ పిస్టళ్లు, 41 సజీవ తూటాలు, పాక్ హ్యాండ్లర్లతో జరిపిన సంభాషణలు ఉన్న 7 మొబైల్ ఫోన్లు, ఒక స్కార్పియో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్‌కు చేరిన ఆయుధాలను, అక్కడి నుంచి వారు ఢిల్లీకి తరలిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత మే నెలలో అందిన నిఘా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ సర్వైలెన్స్, మొబైల్ డేటా విశ్లేషణ ద్వారా ఈ నెట్‌వర్క్‌పై నిశితంగా నిఘా పెట్టిన అధికారులు, మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని, మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

# హైదరాబాద్ రోడ్లపై ఆగని 'గలీజ్ దందా'

యువకులను అందర్నీ పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే ఈ ఘటన జరిగి నెలరోజులు తిరక్కముందే మళ్లీ నగర రోడ్లపై అలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి.తాజాగా కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పరిధిలో అర్ధరాత్రి నడిరోడ్డుపై యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్న వీడియోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కేపీహెచ్‌బీ బస్టాండ్, మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మాస్కులు ధరించిన అమ్మాయిలు, మహిళలు బైక్‌లు, కార్లలో వచ్చిన యువకులు, పురుషులతో రోడ్డు మొత్తం రద్దీగా ఉన్న దృశ్యాలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.దీంతో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల రోడ్లపై ప్రయాణించే నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు, అసౌకర్యం కలుగుతోందని భావించిన సీపీ సుమతి ఇటీవల పెద్ద ఆపరేషన్ చేపట్టినా పరిస్థితి మాత్రం మారడం లేదని నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం ఇలాంటి ఆపరేషన్లు మాత్రమే చేస్తే సరిపోదని కామెంట్లు పెడుతున్నారు. నడిరోడ్డుపై యువతీయువకులు, మహిళలు, పురుషులు ఇలా చేస్తున్నా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని పెట్రోలింగ్ కూడా పెంచాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, పంజాగుట్ట, దిల్‌సుఖ్ నగర్ ప్రాంతాల్లో రాత్రి అయిందంటే చాలు రోడ్లపై యువతులు చేరుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారి కోసం యువకులు, పురుషులు వచ్చి రేటు మాట్లాడుకుని వారిని ఓయో రూంలు, ఇళ్లకు తీసుకెళ్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల వల్ల ఆ ప్రాంతాల్లో నివసించాలన్నా, అటుగా వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు సాధారణంగా రోడ్లపై వెళ్లే మామూలు మహిళలకు ఇలాంటి వేధింపులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# భారీగా పెరిగిన ఢిల్లీ జనాభా

చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

## అక్రమ నిర్మాణాలు చేస్తారు..

# కూల్చవద్దని కోర్టును ఆశ్రయిస్తారా

- అక్రమ నిర్మాణాలతో స్థానికులకు పర్యావరణానికి ఎంత నష్టం జరుగుతుందో తెలుసా.?
- అక్రమ నిర్మాణాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెడతారా.?
- అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల విన్నపం




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఎలాంటి అనుమతులు లేకుండా మున్సిపాలిటీ నిబంధనలు పాటించకుండా, ప్రభుత్వ చట్టాలు అంటే భయం లేకుండా మీకు ఇష్టం వచ్చినట్లు అడ్డుగోలుగా నిర్మాణాలు చేపట్టి కూల్చి వేసేందుకు మున్సిపల్ అధికారులు రాగానే కోర్టును ఆశ్రయిస్తారా.? అంటూ ఓ కేసు విచారణ సందర్భంగా అక్రమ నిర్మాణదారులను(బిల్డర్) ఉద్దేశించి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎవరినైనా లంచాలతో మ్యానేజ్ చేయొచ్చులే అనే డబ్బు ధైర్యంతో ఇష్ట రాజ్యాంగ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు అంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ నిర్మాణాన్ని ఎవరైనా గుర్తించి పత్రికలో కథనాలు రాసినప్పుడు, లేదా ఫిర్యాదు చేసినప్పుడు, ప్రశ్నించినప్పుడు వారిపై అక్రమ కేసులు పెట్టొచ్చులే అనే ధోరణి మార్చుకోవాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. హైదరాబాద్ జీడిమెట్లలో 267 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలంటూ మున్సిపల్ అధికారులు బిల్డర్ కు ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ శశికాంత్ శర్మ అనే వ్యాపారి హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై జస్టిస్ ఎన్.వి శ్రవణ్ కుమార్ ఇటీవలే విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, అధికారులు చట్టప్రకారం నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకోకుండానే నిర్మాణానికి సీలు వేశారని కూల్చివేతలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరాడు. దానికి న్యాయమూర్తి స్పందిస్తూ అధికారులు స్థలం విస్తీర్ణ ఆధారంగా అనుమతులు మంజూరు చేస్తారని, వాటిని పట్టించుకోకుండా అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఇలాంటి అక్రమ నిర్మాణాల వల్ల స్థానికులకు, సమాజానికి ఎదురయ్యే అనేక ఇబ్బందులు అసలు పట్టించుకోవటం లేదని వ్యాఖ్యానించారు. కోర్టుల విచారణలో అక్రమ నిర్మాణాలు అని తేలితే కూల్చివేలు చేస్తామని లేదా భారీగా జరిమానాలు విధిస్తామని హైకోర్టు హెచ్చరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశిస్తూ, విచారణ జూలై 7వ తేదీకి వాయిదా వేశారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో భారీగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై నిర్మాణదారులకు కోర్టులు స్టేలు ఇవ్వవద్దని కోర్టులకు తప్పుడు సమాచారాలు ఇచ్చి స్టే లు పొంది కోర్టు లనే తప్పుదోవ పట్టిస్తున్న అక్రమ నిర్మాణదారులపై, తప్పుదోవ పట్టిస్తున్న న్యాయవాదు పై సైతం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతు వేదికల్లో విత్తనాలు, యూరియా

పలికారు.ఈ క్రమంలోనే నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలను మార్క్‌ఫెడ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఆయిల్ ఫెడ్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని వ్యవసాయ పంటలకు సంబంధించిన ఎరువులు, పురుగుమందులకు సంబంధించి ఒక యాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియా బ్యాగులను రైతు వేదిక ద్వారా రైతులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. యూరియా పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్‌కు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు.యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో ఎరువుల లభ్యత, వినియోగ పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరించాలని పేర్కొన్నారు.

# సువేందు అధికారిపై మమత న్యాయపోరాటం

. ఆ ఎన్నిక సక్రమంగా జరగలేదని, 12 రౌండ్ల తర్వాత, మమతను , ఆమె ఎన్నికల ఏజెంట్‌ను కొట్టి బయటకు పంపేశారని తెలిపారు. అసలు ఆ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) ఎవరు? 2021 నందిగ్రామ్ ఎన్నికల్లో ఆయనే ఆర్వోగావ్యవహరించారు. మళ్లీ ఇప్పుడు ఆయనే ఆర్వోగా వచ్చారు. ఆ తర్వాత, ఆయనను ముఖ్యమంత్రికి డిప్యూటీ సెక్రటరీగా నియమించారు, ఎన్నికలైన వెంటనే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని చీఫ్ సెక్రటరీగా నియమించారని కళ్యాణ్ బెనర్జీ ఆరోపించారు. వారిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, అలాగే వారు పక్షపాతం చూపించే అవకాశం కూడా స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు.

# సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్

లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, తమ పిలుపు మేరకు రైతులు 35 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రాజధాని కోసం ఇచ్చారని, ఆ భూమిని అభివృద్ధి చేసి రైతులకు ప్లాట్ల రూపంలో తిరిగి ఇచ్చే ల్యాండ్ పూలింగ్ మోడల్‌ను ఆయన సదస్సులో వివరించారు. అభివృద్ధి ద్వారానే సంపద సృష్టి సాధ్యమని చెప్పేందుకు తాను గతంలో నిర్మించిన సైబరాబాద్‌ను చంద్రబాబు ఉదాహరణగా చూపారు."25 ఏళ్ల క్రితం నేను ఐటీ గురించి మాట్లాడాను. భవిష్యత్తును ముందుగానే ఊహించి 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్' తీసుకున్నాం. దాని ఫలితంగానే నేడు తెలుగువారు తలసరి ఆదాయంలో ముందున్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) గురించి ఆలోచిస్తున్నాం," అని ఆయన అన్నారు. నాడు తాను నిర్మించిన సైబరాబాద్ నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, ఒకప్పుడు ఎకరం రూ.2 లక్షలు ఉన్న భూమి ఇప్పుడు రూ.200 కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత మరోసారి కొత్త నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. ప్రసంగం అనంతరం, సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సింగపూర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సింగపూర్ పెవిలియన్‌లోని అత్యాధునిక పట్టణాభివృద్ధి నమూనాలను, 'ఇన్నోవేటర్స్ అలే'లో స్టార్టప్‌ల ఆవిష్కరణలను, గూగుల్ స్టాల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. టెక్నాలజీ ఆధారిత పాలనలో సింగపూర్ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

# కేంద్ర జలశక్తి మంత్రితో పవన్ భేటీ

ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నీటి కొరత తీరలేదని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రజలకు స్థిరమైన తాగునీటి సరఫరా అందించడానికి గుజరాత్‌లోని 'సూరత్ నమూనా'ను అధ్యయనం చేయాలని అధికారులకు పవన్ సూచించారు. సూరత్‌లో పారిశ్రామిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి మళ్లీ ఎలా విజయవంతంగా వినియోగిస్తున్నారో, అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో నదీ జలాల స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ స్పష్టం చేశారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల ఏపీలోని నదులు, జలవనరులు దారుణంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు వదిలే వ్యర్థాల వల్ల నదులు కలుషితం కాకుండా 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

# మెట్రో లోన్ ఆగిన విషయమే తెలియదు

ఆగిపోతాయా అంటూ ప్రశ్నించారు. సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేకుండా, అనాలోచితంగా తనపై బురదజల్లడమే ఫ్యాషన్‌గా మార్చుకున్నారని మండిపడ్డారు.

### రేవంత్ సర్టిఫికెట్ అవసరం లేదు

తెలంగాణ అభివృద్ధి కోసం తాము చేస్తున్న పనులకు సీఎం రేవంత్ రెడ్డి సర్టిఫికేట్ ఇవ్వాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. తాను రేవంత్ రెడ్డికి కాదు కేవలం తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని అని స్పష్టం చేశారు. ఒక్క రహదారుల రంగానికే రాష్ట్రంలో కేంద్రం రూ. 1.75 లక్షల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. రాష్ట్ర హక్కుల కోసం తాము కాంగ్రెస్ నేతల దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన పని లేదని, ఒక కేంద్ర మంత్రిగా తన బాధ్యతలను తాను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానని చెప్పారు.

### రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎప్పుడూ ముందుంటాం!

తెలంగాణ కోసం తాను చేసిన పోరాటాలను ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియా ముందు ప్రస్తావించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఢిల్లీ వేదికగా రెండు సార్లు తాను స్వయంగా ధర్నాలు చేశానని, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందే వరకు ఆమరణ దీక్ష చేసిన చరిత్ర తనదని గుర్తుచేశారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కోసం నాడు కేసీఆర్‌కు, నేడు సీఎం రేవంత్ రెడ్డికి చొరవ తీసుకుని లేఖలు రాసింది తానేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అడిగితేనే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఎప్పుడూ ముందుంటామని వివరించారు. రాజకీయ కక్షలతో ప్రాజెక్టులను అడ్డుకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కావచ్చు కానీ, భారతీయ జనతా పార్టీకి ఆ అలవాటు లేదని కిషన్ రెడ్డి గట్టిగా చెప్పారు.

### లోన్ నిలిచిపోయిందని తెలియదు!

హైదరాబాద్ మెట్రో విస్తరణ కోసం చురుగ్గా పనిచేయాలని, నిధుల సాధనపై దృష్టి పెట్టాలని గతంలో తానే స్వయంగా రేవంత్ రెడ్డికి లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. మెట్రో నిధుల నిలిపివేతతో తనకు ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్ర ప్రభుత్వం తమ వైఫల్యాలను, ఆలస్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. లోన్ నిలిచిపోయిందన్న విషయం తనకు తెలియదన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు చుట్టూ జరుగుతున్న ఈ రాజకీయ యుద్ధం తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు మెట్రో లోన్ల బదిలీలో కేంద్రం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ విమర్శిస్తుంటే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్లే ప్రాజెక్టులు నలుగుతున్నాయని బీజేపీ తిప్పికొడుతోంది.

# ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు

ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు.

ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

# భారత్‌లో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.మే 2026లో జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలు వెల్లువెత్తడంతో జూన్ 21న రీ-ఎగ్జామ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పలు టెలిగ్రామ్ ఛానెళ్లు, గ్రూపుల ద్వారా చీటింగ్ ముఠాలు విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. కొన్ని ఛానెళ్లను తొలగించినా సమస్య తీవ్రత తగ్గకపోవడంతో, దేశవ్యాప్త నిషేధానికి సిఫార్సు చేయగా, ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది.

## రెండేళ్లలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణలో గణనీయ పురోగతి: హోం మంత్రి వంగలపూడి అనిత

**ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ విశిష్ట పురోగతి**



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ల సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పథంతో పునర్నిర్మిస్తూ, ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలనా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అనేది కేవలం అధికార ప్రదర్శన కాదని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే బాధ్యతగా ప్రభుత్వం విశ్వసిస్తోందని ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసు-ప్రజల సమన్వయం, సాంకేతికత వినియోగం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన స్పందన, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అని మంత్రి స్పష్టం చేశారు.అదనపు డిజి మదుసూధన రెడ్డి, హోం శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ కుమార విశ్వజిత్, ఎస్.పి.ఎఫ్. డిజి డా.త్రివిక్రమ వర్మ, హోం శాఖ స్పెషల్ సెక్రటరీ విజయకుమార్, ఈగల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ, ఐజిలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్ జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ**



పుట్టపర్తి(ప్రశ్న న్యూస్) జిల్లాలో రెండేళ్ల సుపరిపాలన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని శాఖల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని మంత్రి తెలిపారు. గతంలో శ్రీకృష్ణదేవరాయలు చెరువులు తవ్విస్తే, వాటికి నీళ్లు అందించి రాయలసీమను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు చంద్రబాబు నాయుడు అని ఆమె కొనియాడారు.రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ఏకంగా రూ. లక్ష కోట్ల నిధులను కేటాయించిందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తూ, రైతులకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లు, వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం వర్షాలు పడి వ్యవసాయ పనులు ప్రారంభమైన తరుణంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వేరుశనగ విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నాణ్యత లేని విత్తనాలు వచ్చాయని అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో దాదాపు 72,000 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు అవసరం ఉండగా, ఇప్పటికే 15,000 హెక్టార్లకు సరిపడా విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన రైతులకు కూడా ఎలాంటి కొరత లేకుండా సకాలంలో విత్తనాలు అందుతాయని మంత్రి సవితమ్మ భరోసా ఇచ్చారు.ప్రెస్ మీట్‌లో ఎంపీ బికె.పార్థసారధి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,మాజీ ఎంఎల్‌సి గుండుమలే తిప్పేస్వామి తదితర ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హిమయత్‌నగర్ శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**బ్రహ్మోత్సవాలకు ఆధ్యాత్మిక శోభను చేకూర్చిన పవిత్ర కార్యక్రమం**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) హిమయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. జూన్ 20 నుండి 24వ తేదీ వరకు జరగనున్న 21వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సన్నాహకంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ.ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా సాగింది.ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజాసామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేసి దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేశ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస మణికంఠ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీల ఆశాజ్యోతి

## తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యెట్టి ప్రకాష్.

**ఆదివాసీ హక్కుల పోరాటంలో మరో ముందడుగు**

**- జాతీయ అధ్యక్షుడు వట్టం ఉపేందర్.**



ములుగు (ప్రశ్న న్యూస్) ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న యువ నాయకుడు, ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలానికి చెందిన యెట్టి ప్రకాష్‌ను 'తుడుందెబ్బ' సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆదివారం ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు.

### నాయకత్వమంటే ఉద్యమమే ఊపిరి..

యెట్టి ప్రకాష్ గత దశాబ్ద కాలంగా ఆదివాసీ ప్రాంతాల్లో జల్-జంగల్-జమీన్ హక్కుల కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తున్నారు. పోడు భూముల సమస్య, 1/70 చట్టం అమలు, ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా-వైద్య వసతుల కల్పన వంటి అంశాలపై ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. "ఆదివాసీ గొంతుక పార్లమెంట్‌లో కాదు, ముందుగా గూడెంలో వినిపించాలి" అనేది ప్రకాష్ నమ్మిన సిద్ధాంతం. ఆయనలోని ఈ చిత్తశుద్ధి, తెగువనే గుర్తించి జాతీయ నాయకత్వం ఈ కీలక బాధ్యతలు అప్పగించిందని సంఘం వర్గాలు తెలిపాయి.

### నాయకత్వ లక్షణాలు - ప్రజల మనిషి..

గూడెం గూడెం తిరిగి ఆదివాసీల కష్టాలు తెలుసుకున్న నాయకుడు. ఏసీ గదుల్లో కూర్చుని కాకుండా, ప్రజల మధ్య ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపే తత్వం ఆయనది. అరెస్టులు, కేసులకు భయపడకుండా ఆదివాసీ హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారు. యువతను ఉద్యమ బాటలో నడిపించడంలో ఆయన పాత్ర కీలకం. తుడుందెబ్బ సంఘంలోని సీనియర్ నాయకులతో పాటు యువ కార్యకర్తలను కలుపుకొని పోయే స్వభావం. అందరినీ ఒక్కతాటిపై నడిపించగల సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు.

"రాజ్యాంగం కల్పించిన 5వ షెడ్యూల్ హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయించడమే నా లక్ష్యం. ఆదివాసీ యువతకు రాజకీయ, సామాజిక చైతన్యం కల్పిస్తా" అని బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రకాష్ పేర్కొన్నారు. ఈ నియామక కార్యక్రమంలో తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోడెం గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, రాష్ట్ర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు. "యెట్టి ప్రకాష్ నియామకం తెలంగాణ ఆదివాసీ ఉద్యమానికి మరింత బలాన్ని ఇస్తుంది. ఆయన నాయకత్వంలో సంఘం గ్రామస్థాయి వరకు విస్తరిస్తుంది" అని రాష్ట్ర అధ్యక్షుడు గోడెం గణేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రజల హర్షం..



యెట్టి ప్రకాష్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల ములుగు జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ నాయకులు, మేధావులు, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఏటూరు నాగారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివాసీ యువకులు సంబరాలు చేసుకున్నారు. "మా గూడెం బిడ్డ రాష్ట్ర స్థాయి నాయకుడు కావడం మాకు గర్వకారణం" అని స్థానికులు పేర్కొన్నారు.

"జాతీయ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడుతా" అని యెట్టి ప్రకాష్ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## ఏలూరులో రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం

**మంత్రి కొలుసు పార్థసారధి, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్**

**1042 ఎకరాల భూములను 22ఏ జాబితా నుండి తొలగించాం**



ఏలూరు(ప్రశ్న న్యూస్) రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక ఇండోర్ స్టేడియం లో మంగళవారం రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దేశానికీ వెన్నుముక ఐన రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. విత్తనం నాటిన దగ్గరనుండి పండిన పంటకు గిట్టుబాటు దార కల్పించే వరకు రైతుకు అన్ని విధాలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం చివరిలో 4. 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 6. 30 లక్షల మంది రైతుల నుండి 9132 కోట్ల రూపాయల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ సీజన్లో కూటమి ప్రభుత్వం 7. 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10.27 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసి 17వేల 455 కోట్ల రూపాయలను రైతులకు చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు జుత్తిగ నాగరాజు, ఇంచార్జి రెవెన్యూ అధికారి ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఏపీ ఎస్సీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు దాసరి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీరామకృష్ణ, అంబికా కృష్ణ, మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, ఏలూరు ఉడా ఛైర్మన్ పెద్దిబోయిన వాణి శివప్రసాదు, ఏఎంసీ ఛైర్మన్లు మామిళ్ళపల్లి పార్థసారథి, గారపాటి రామసీత, ఏలూరు బిజెపి అధ్యక్షులు సి.హెచ్.విక్రమ కిషోర్, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరాజులు, వివిధ ఏఎంసి ఛైర్మన్లు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, వివిధ శాఖలు జిల్లా అధికారులు, రైతులు, మహిళలు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్లలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

**- ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయి కుమార్ డిమాండ్**

**పిడుగురాళ్ల** పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పిడుగురాళ్ల మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి కి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయి మాట్లాడుతూ పలు పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు మరియు ఇతర విద్యా సామగ్రిని పాఠశాల ప్రాంగణంలోనే విక్రయిస్తూ తల్లిదండ్రులను బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ) స్ఫూర్తికి విరుద్ధంగా జరుగుతున్న ఈ చర్యల వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

కావున పిడుగురాళ్ల పట్టణంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులపై ప్రత్యేక విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రైవేట్/కార్పొరేట్ పుస్తకాల గదులను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులను నిర్దిష్ట దుకాణాలు లేదా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫారాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పిడుగురాళ్ల మండల కమిటీ డిమాండ్ చేస్తుంది అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పిడుగురాళ్ల మండల అధ్యక్షులు కే. రోహిత్, ఉపాధ్యక్షులు రామకృష్ణ జిల్లా కమిటీ సభ్యులు యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో వైభవంగా స్వర్ణరథోత్సవం పై ఊరేగిన స్వామి అమ్మవార్లు



శ్రీశైలం (ప్రశ్న న్యూస్)ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

**అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.**

ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యురాలు జిల్లెల శ్రీదేవి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధికోసం వాస్తవాలను వక్రీకరించొద్దు

**-బాధ్యత మరచి మాట్లాడడం సిగ్గుచేటు**

**-దుండ్రపల్లి గ్రామ సర్పంచ్ : జంగం అంజయ్య**

**-మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ వ్యాఖ్యలపై సర్పంచ్ జంగం అంజయ్య ఆగ్రహం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్5సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని గ్రామ సర్పంచ్ జంగం అంజయ్య విమర్శించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ కోణంలో వ్యాఖ్యానించడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తాగి ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడిన వ్యక్తి వ్యవహారాన్ని సమర్థించడం సరైన పద్ధతి కాదు. ఒక మాజీ ఎమ్మెల్యేగా ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం విచారకరం. వ్యక్తిగత ఘటనలకు రాజకీయ రంగు పులమడం వల్ల సమాజానికి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉంది" అని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన నాయకులు ఇలాంటి అంశాలపై సంయమనం పాటించాలని అంజయ్య సూచించారు. ప్రజాప్రతినిధులు తమ హోదాకు తగిన విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాస్తవాలు తెలుసుకున్న తర్వాతే ప్రకటనలు చేయాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ తనపై ప్రజల్లో ఉన్న గౌరవాన్ని కాపాడుకునేలా వ్యవహరించాలని, సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేలా నాయకులు వ్యవహరించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ జంగం అంజయ్య అన్నారు.

# ఉద్యమకారుడి నుండి జిల్లాధ్యక్షులుగా శ్రీనివాస్ ప్రస్థానం

**- తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా కత్తెరపాక శ్రీనివాస్ నియామకం**

**- ఉద్యమ కళాకారుల ఆశయ సాధనకు కృషి చేస్తా**

**- కత్తెరపాక శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు,బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామానికి చెందిన ఉద్యమ కళాకారుడు కత్తెరపాక శ్రీనివాస్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దరువు అంజన్న, అనువోజు వెంకటేశం, నకిరేకంటి కిరణ్, ప్రతాప్, సలీమ్ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.నియామక పత్రం స్వీకరించిన అనంతరం కత్తెరపాక శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపేందుకు తాను నిరంతరం కృషి చేశానని పేర్కొన్నారు. అయితే అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాంస్కృతిక సారథి ఉద్యోగాల భర్తీలో తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన సేవలను గుర్తించి సాంస్కృతిక సారథి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ ఉద్యమ కళాకారుల హక్కులు, సంక్షేమం కోసం తాను ఎన్నో సందర్భాల్లో పోరాటాలు నిర్వహించానని శ్రీనివాస్ తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, సంఘం బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు, ఉద్యమ కళాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కత్తెరపాక శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

**- వేములవాడ రూరల్ ఎస్సై : చల్లా వెంకట్రాజం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండల ప్రజలు ఈ నెల 20న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎస్సై చల్లా వెంకట్రాజం కోరారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కంపౌండబుల్, కుటుంబ, ఆస్తి, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో త్వరగా పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని సూచించారు.

# నోట్ల కట్టలపై నరహరి నిద్ర

**- ఏసీబీ దాడుల్లో రూ.1.54 కోట్ల నగదు, కిలో బంగారం సీజ్**

**- భూపరిపాలన శాఖ అధికారి నరహరి నివాసంలో ఏసీబీ సోదాలు**

**- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆకస్మిక దాడులు**

**- అధికారి నరహరిని అరెస్ట్ చేసి విచారిస్తున్న ఏసీబీ**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ భూపరిపాలన, సర్వే విభాగంలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారి నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమాస్తులు వెలుగులోకి వచ్చాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సర్వే శాఖ మల్టీ జోన్-2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌తో పాటు మొత్తం 11 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలోని బృందాలు ఈ సోదాలు చేపట్టాయి. హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాకలోని నరహరి నివాసం, నారాయణగూడలోని ఆయన కార్యాలయంతో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో తనిఖీలు జరిగాయి. ఈ క్రమంలో నరహరి ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా పైభాగంలో దాచిన రూ.1.54 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు సుమారు ఒక కిలో బంగారం, పలు కీలక ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు.స్వాధీనం చేసుకున్న ఆస్తుల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని, బహిరంగ మార్కెట్ విలువ అంతకు అనేక రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. కోటి రూపాయలకు పైగా విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు లాకర్లను కూడా అధికారులు గుర్తించారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బ్యాంకులకు లేఖలు రాశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రాథమిక విచారణ జరిపిన ఏసీబీ ఈ చర్యలు చేపట్టింది. అరెస్ట్ చేసిన నరహరిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. ఆయన కుమారుడి పేరుతో ఉన్న స్థిరాస్తుల వివరాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోంది. నగదును బెడ్ రూమ్‌లోని బీరువా పైన ఉన్న కబోర్డులో గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఏసీబీ దాడుల చరిత్రలో ఒకేచోట ఇంత భారీ మొత్తంలో నగదు లభించడం అరుదని ఆయన పేర్కొన్నారు. సుంకరి నరహరిని అరెస్టు చేశామని, రేపు కోర్టులో హాజరుపరుస్తామని ఆయన వెల్లడించారు.

# ఏటూరు నాగారం మండలంలో లా అండ్ ఆర్డర్ పటిష్టం

**- ఏస్ఐ మహేష్ సేవలకు ప్రజల ప్రశంసలు**

**- బిప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరిగింది: స్థానికులు**



**ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్)** ఏటూరు నాగారం మండలంలో ఏస్ఐ మహేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### లా అండ్ ఆర్డర్ పటిష్టం

ఏస్ఐ మహేష్ రాకతో మండలంలో గ్రామాల వారీగా నైట్ పెట్రోలింగ్ పెరిగింది. గతంలో అర్ధరాత్రి వరకు కొనసాగిన గొడవలు, గంజాయి, మద్యం అక్రమ రవాణా కేసులు గణనీయంగా తగ్గాయి. స్థానిక యువతతో సత్సంబంధాలు ఏర్పరచుకొని గ్రామాల్లో శాంతి కమిటీలను యాక్టివేట్ చేశారు. గత 3 నెలల్లో మేజర్ క్రైమ్ రేట్ 60% తగ్గినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

### ప్రజా సమస్యలపై సత్వర స్పందన

భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఇరువర్గాలను పిలిపించి పోలీస్ స్టేషన్‌లోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కోర్టు మెట్లు ఎక్కకుండానే ఎన్నో చిన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు.

### ప్రజలతో మమేకం

ప్రతి రోజు "పోలీస్ మీ కోసం" కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్‌ను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

### ప్రజల అభిప్రాయం:

ఏటూరు నాగారం వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు అయూబ్ ఖాన్ మాట్లాడుతూ, "మహేష్ సార్ వచ్చాక రాత్రి 10 గంటలైనా షాపులు నడపడానికి భయం లేదు. ఏ సమస్య వచ్చినా వెంటనే రెస్పాండ్ అవుతున్నారు" అన్నారు. గృహిణిలు గతంలో స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడేవాళ్లం. ఇప్పుడు మా ఆడవాళ్ల ఫిర్యాదులను స్వయంగా విని న్యాయం చేస్తున్నారు అని చెప్పారు.

### అధికారుల స్పందన:

ఈ విషయమై ఏస్ఐ మహేష్‌ను సంప్రదించగా, "ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమైంది. ఏటూరు నాగారం మండలం లోని ప్రజలు చాలా వివేకవంతులు మండలంలోని ప్రజలతో ఎలాంటి సమస్యలు లేవు సమస్యల్ల స్థానికెతరులు ఇక్కడికి వచ్చి కొన్ని సమస్యలు సృష్టిస్తున్నారు త్వరలోనే వాటిని అధిగమిస్థాము.లా అండ్ ఆర్డర్ అంటే కేవలం కేసులు పెట్టడం కాదు, నేరం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం. మండలాన్ని క్రైమ్ ఫ్రీగా మార్చడమే నా లక్ష్యం" అని తెలిపారు.ప్రజా సేవకే ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్-పబ్లిక్ మధ్య వారధిగా నిలుస్తున్న ఏస్ఐ మహేష్ సేవలను మండల ప్రజలు కొనియాడుతున్నారు.

## శ్రీలక్ష్మీనారాయణ సన్నిధిలో వైభవంగా శ్రీ పెరియాళ్వార్ ఉత్సవాలు ప్రారంభం: టిటిడి.

**ప్రబంధ పాశురాల పారాయణంతో ఆధ్యాత్మిక వాతావరణం**

**జూన్ 25న గరుడ--గజ వాహనాలపై స్వామివారు,**

**పెరియాళ్వార్ దివ్య విహారం**



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి ఆలయంలో శ్రీ వైష్ణవ సంప్రదాయ మహామహుడు, శ్రీమహావిష్ణువు పరమభక్తుడు అయిన శ్రీ పెరియాళ్వార్ ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జూన్ 25వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి శ్రీ పెరియాళ్వార్ సన్నిధిలో దివ్యప్రబంధ పాశురాలను భక్తిపూర్వకంగా నివేదించి ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లారు.శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందిన మహాభాగవతుడు, శ్రీ ఆండాళ్ అమ్మవారి తండ్రి అయిన శ్రీ పెరియాళ్వార్ తులసీమాలలను స్వయంగా తయారు చేసి ప్రతిరోజూ స్వామివారికి సమర్పించేవారని, ఆయన రచించిన పాశురాలు నేటికీ వైష్ణవ సంప్రదాయానికి ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలిచాయని అర్చకులు వివరించారు.ఉత్సవాల చివరి రోజైన జూన్ 25న ఉదయం శ్రీ పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం శ్రీ గోవిందరాజస్వామివారు గరుడవాహనంపై, శ్రీ పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం



**పిడుగురాళ్ల,** :ఐసిడిఎస్ పిడుగురాళ్ల ప్రాజెక్టు పరిధిలో గల లెనిన్ నగర్ -1 అంగన్వాడీ కేంద్రం లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడుగురాళ్ల యూనిట్ సిడిపిఓ రాజేశ్వరి తో పాటు సూపర్వైజర్లు ఎస్. నాగమణి, శ్రీదేవి, అంగన్వాడి టీచర్ శ్రీదేవి, పద్మ, ఆనంద, సరళ, వెంకయమ్మ, హసీనా, అంగన్వాడి పిల్లలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై,పీసీ 19 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలి

**- జీఓ - 46 ను రద్దు చేయాలి - డా. ప్రసన్న హరికృష్ణ**




**బోయినిపల్లి / కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఎస్ఐ, పీసీ విభాగాల్లో ఖాళీగా ఉన్న 19 వేల పోస్టులతో వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డా. ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు.నిరుద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, గత నియామకాల కారణంగా వయోపరిమితి దాటిపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే తగిన ఏజ్ రిలాక్సేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అలాగే నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న జీఓ-46ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి యువతకు భరోసా కల్పించాలని కోరారు.నిరుద్యోగ యువత తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని, ఉద్యోగాల భర్తీ కోసం శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగించాలని డా. ప్రసన్న హరికృష్ణ పిలుపునిచ్చారు

## ప్రజల ఆరోగ్యం,సంక్షేమమే ధ్యేయం

**- మాన్వాడ సర్పంచ్ : కట్ట గోవర్ధన్**

**- మాన్వాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,మాన్వాడ గ్రామంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి, సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా ముగిసిందని గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ తెలిపారు.ఈ శిబిరంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన వారికి వైద్యుల సూచనలు, చికిత్సకు సంబంధించిన మార్గదర్శకాలు అందించారని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ఉప సర్పంచ్ జితేందర్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు విశేషంగా సహకరించినట్లు కట్ట గోవర్ధన్ తెలిపారు. అలాగే ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య బృందానికి, కార్యక్రమానికి సహకరించిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా నిర్వహించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ కట్ట గోవర్ధన్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సత్యం సహకారంతో పద్మశాలి భవన నిర్మాణానికి మార్గం సుగమం

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- విలాసాగర్ పద్మశాలి భవనానికి రూ.4 లక్షల నిధులు**

**- ప్రొసీడింగ్ కాపీ అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



బోయినిపల్లి/ గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం,గంగాధర మండల కేంద్రంలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో పద్మశాలి భవన నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పద్మశాలి సంఘ ప్రతినిధులకు అందజేశారు.ఈ సందర్భంగా విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సంఘ సభ్యులు కూడా ఎమ్మెల్యే సేవలను కొనియాడుతూ, సంఘ అభివృద్ధి,గ్రామ సంక్షేమానికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మద్దతు కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# బంగారు పుస్తెలతాడు కడిగి మెరిపిస్తామంటూ మోసం చేసిన ఇద్దరు అరెస్ట్

- ఈ కేసును ఛేదించిన తొగుట పోలీసులు



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో ఓ మహిళ వద్ద నుండి బంగారు పుస్తెలతాడును కడిగి మెరిపిస్తామని నమ్మబలికి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను తొగుట పోలీసులు అరెస్ట్ చేశారు. తొగుట ఎస్ఐ వి. రవికాంత్ రావు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో జూన్ 15న సాయంత్రం మెట్టు ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారి పేర్లు మహమ్మద్ రుస్తుం (49), తండ్రి బర్కత్ అలీ, మధురాపూర్ గ్రామం మరియు మహమ్మద్ గ్యాస్ అలీ (41), తండ్రి రఫిక్ అలీ, నారాయణపూర్ గ్రామం, బీహార్ రాష్ట్రంగా గుర్తించారు. ఇద్దరూ కలిసి సిద్దిపేట జిల్లాకు వచ్చి జూన్ 13న వెంకట్రావుపేట గ్రామంలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును కొత్తదానిలా మెరిపిస్తామని నమ్మించి తీసుకున్నారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న గిన్నెలో ఉన్న రసాయన ద్రావణంలో తాడును ముంచి శుభ్రం చేసే పేరుతో కొంత బంగారాన్ని కరిగించి, తిరిగి తాళిబొట్టును మహిళకు ఇచ్చినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ వి. రవికాంత్ రావు, హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు భాను, నాగరాజు, ఉమలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికాంత్ రావు మాట్లాడుతూ, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్–100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు

# ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన క్రీడాకారులు

- క్రీడా హబ్‌కు కేటాయించిన భూమిని యువజన, క్రీడల శాఖ పేరిట బదిలీచేయాలి
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సహకరించాలి : ఎన్‌సీ సంతోష్



**గజ్వేల్ ( ప్రశ్నా న్యూస్ )** గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరింత సహకారం అందించాలని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ కోరారు. మంగళవారం గజ్వేల్‌లో అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారుల ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ సంతోష్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్‌లో క్రీడాకారుల కోసం సుమారు 20 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. సర్వే నంబర్ 560/16లో ఉన్న ప్రభుత్వ భూమిని క్రీడా హబ్ నిర్మాణం కోసం యువజన, క్రీడల శాఖ పేరిట రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ఆలస్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

యువత క్రీడల్లో రాణించాలనే మంచి సంకల్పంతో క్రీడా హబ్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. క్రీడా హబ్ ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరిచంద్ర ప్రసాద్, శివ, రాజు, కనకయ్య, ఇలియాస్, స్వామి తదితర క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - ఎస్.టి. కమిషన్ సభ్యులు పి .వెంకటప్ప



**అనంతపురం (ప్రశ్న న్యూస్)** జిల్లా ప్రధాన కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్. టి. కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లోని పలు వైద్య సేవ విభాగాలను పరిశీలించారు. అనంతరం రోగులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే ప్రజలతో వైద్య సిబ్బంది దృక్పథంతో స్పందించి ఆరోగ్య సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంతోమంది నిరుపేదలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని అందువల్ల వైద్యులు కూడా వారి సంపూర్ణ ఆరోగ్యం కోసం తగినంతగా వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా తన వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత ,తాగునీటి వసతి అవసరమైన మేరకు రోగులకు మందుల పంపిణీ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డా. మల్లేశ్వరి, ఆర్. ఎం. ఓ. డా. హేమలత, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డా. గంగాధర్ రెడ్డి నర్సింగ్ ప్రొఫెసర్,డా. నిర్మలా బాయి, డా. శౌరి డా. సౌజన్యడా. నారాయణస్వామి డిసిహెచ్ఎస్ డా . డేవిడ్. తదితరులు పాల్గొన్నారు.

# పెంచక్ సిలాట్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహణ

**- జూన్ 25 నుండి నాసిక్‌లో జాతీయ స్థాయి పోటీలు.. ఓవరాల్**

**- ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన మంచిర్యాల జిల్లా**

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రస్థాయి పెంచక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలు ఆదివారం జూన్ 14వ తేదీన జంగా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. పెంచక్ సిలాట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

### పది జిల్లాల నుండి క్రీడాకారుల ఉత్సాహభరిత భాగస్వామ్యం :

ఈ క్రీడా పోటీల్లో మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, ఖమ్మం, జగిత్యాల, మరియు నిజామాబాద్ జిల్లాల నుండి 185 మంది క్రీడా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి ప్రీ జూనియర్, జూనియర్, మరియు సీనియర్ విభాగాలలో పోటీలను అత్యంత ఉత్కంఠభరితంగా నిర్వహించారు.

### ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక :

ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పెంచక్ సిలాట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ సిహెచ్. దశరథం, ముఖ్యకార్యదర్శి డి. దుర్గా సతీష్ గౌడ్ తెలిపారు. ఈ నెల జూన్ 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించబోయే 14వ జాతీయస్థాయి పెంచక్ సిలాట్ పోటీల్లో వీరు తెలంగాణ తరపున పాల్గొంటారని వారు వివరించారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం మరియు అభినందనలు :

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎంఆర్ స్కూల్ గ్రూప్స్ అధినేతలు చామకూర శ్రీశైలం రెడ్డి, శ్రీమతి చామకూర సౌజన్య రెడ్డి, ముత్యాల గాంధీ యాదవ్, మరియు సిహెచ్. దశరథం విచ్చేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు వారు చేతుల మీదుగా పథకాలు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా చామకూర శ్రీశైలం రెడ్డి మరియు శ్రీమతి చామకూర సౌజన్య రెడ్డి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, పెంచక్ సిలాట్ ఎంతో ప్రాచీనమైన క్రీడ అని, ఇది ముఖ్యంగా ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. అదేవిధంగా ఈ క్రీడకు స్పోర్ట్స్ కోటా సదుపాయం కూడా ఉండటం వల్ల భవిష్యత్తులో క్రీడాకారుల ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

### మంచిర్యాల విక్టరీ.. మేడ్చల్‌కు రన్నరప్ ఛాంపియన్‌షిప్ :

ఈ పోటీలలో క్రీడాకారులు కనబరిచిన ఓవరాల్ ప్రతిభ ఆధారంగా మంచిర్యాల జిల్లా క్రీడాకారులు



ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుచుకోగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ జిల్లాల కోచ్‌లు, మరియు క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు.

# ఆక్వా రైతులను ఆదుకుంటున్నది ఎన్డీఏ ప్రభుత్వమే:మంత్రి అచ్చెన్నాయుడు

- రాజకీయ లబ్ధి కోసమే గొడ్డలి పార్టీ విమర్శలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆక్వా రంగాన్ని అస్తవ్యస్తం చేసి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్న గొడ్డలి పార్టీకి వాస్తవాలు మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతి చిన్న విషయాన్ని రాజకీయ కోణంలో చూస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి వెన్నతో పెట్టిన విద్య అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫీడ్ తయారీ సంస్థలు ఏకపక్షంగా ధరలు పెంచేందుకు ప్రయత్నించినప్పుడు, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఆ ప్రక్రియను వెంటనే నిలిపివేసిందని మంత్రి స్పష్టం చేశారు. "రైతులపై భారం మోపే ఏ ప్రయత్నాన్ని ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. విజయవాడలో ఏపిడా ఆధ్వర్యంలో సుదీర్ఘ సమావేశం నిర్వహించి, ప్రపంచవ్యాప్త ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల కలిగిన ఇబ్బందులను రైతులకు, యాజమాన్యాలకు వివరించాం. ధరల విషయంలో పారదర్శకత ఉండాలని, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే జరగాలని తేల్చిచెప్పాం" అని ఆయన పేర్కొన్నారు.

### అబద్ధపు ప్రచారానికి చెక్

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సబ్సిడీ పేరుతో జరిగిన మోసాలను మంత్రి ఎండగట్టారు. "అప్పుడు ఎన్నికల ముందు అందరికీ రూపాయిన్నరకు విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక జోన్, నాన్‌జోన్ అంటూ రైతుల మధ్య చిచ్చు పెట్టారు. కానీ, నేడు ఎన్డీఏ ప్రభుత్వం ఎలాంటి పరిమితులు లేకుండా ప్రతి రైతుకూ రూపాయిన్నరకే విద్యుత్ అందిస్తోంది. గత ప్రభుత్వం 57 నెలల్లో రూ. 3,300 కోట్లు ఇస్తే, మేము ఒక్క సంవత్సరంలోనే రూ. 1,170 కోట్ల సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరుస్తున్నాం. ఇది కదా రైతు పక్షపాత ప్రభుత్వం అంటే?" అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాబ్‌లన్నీ కేవలం బోర్డులకే పరిమితమని, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ల్యాబ్ కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని అచ్చెన్నాయుడు ఆరోపించారు. "ఏ గ్రామానికి రమ్మన్నా వస్తా.. అక్కడ ఒక్క పని చేసే ల్యాబ్ చూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా. మీది అబద్ధాల పునాదుల ప్రభుత్వం, మాది వాస్తవాల ప్రభుత్వం" అని ఆయన నిప్పులు చెరిగారు. రొయ్యల ఫీడ్ ధరల నిర్ణయంలో రైతుల ప్రమేయం ఉండాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వివరించారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసిందని, అందులో రైతులు, తయారీదారులు, ప్రభుత్వ అధికారులు ఉంటారని చెప్పారు. ఇకపై ధరల పెరుగుదలైనా, తగ్గుదలైనా చర్చల ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. "రాజకీయాల కోసం రైతుల ఉసురు తీసుకోవద్దు. ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలను చూసి ఓర్వలేక విమర్శించడం మానుకోండి. నిజాలు మాట్లాడటం నేర్చుకోండి" అని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఉద్దేశించి మంత్రి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# గుడివాడ అమర్ నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన : బూర్ల రామాంజనేయులు



గుంటూరు (ప్రశ్న న్యూస్) పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వారు మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాథ్ రాష్ట్ర హోం మంత్రి, దళిత మహిళ వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఒక నీతిమాలిన చర్య అని, వైసీపీ నాయకులు మహిళలను ఒక ఆట బొమ్మలాగా చూస్తున్నారా అని ప్రశ్నించారు, ఆడపడుచులు అంటే ఇంటిని చక్కదిద్దేవారు ఆదిశక్తులని నమ్మి ఆనాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆడపడుచులకు ఆస్తి హక్కు కల్పించారని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి, మహిళలు అబలలు కాదు అని చాటి చెప్పిన మహనీయులు స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు పెట్టి ఆర్థిక స్వాలంబన కల్పించిన నాయకులు చంద్రబాబు నాయుడు . ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ ఎంటర్ప్రెన్యూర్ కావాలని, అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఆస్తి కూడా మహిళలు పేరే ఉండాలని నిర్ణయంతో ముందుకు వెళ్తుంటే, అంతేకాకుండా మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించాలని ముందడుగు వేస్తుంటే, ఆడపడుచులు వేసుకునేటువంటి మేకప్పులపై గురించి మీరు మాట్లాడుతున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళా సంఘాలు, మహిళా స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన: మంత్రి నిమ్మల.


- వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం



మార్కాపురం (ప్రశ్న న్యూస్) సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందిస్తాం అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్ లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్ లో 905 కోట్లు కేటాయించాం అని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి డోర్నాల లో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్ళి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు పనులను క్షేత్ర స్ధాయిలో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టు లో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్ లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాం అని, అదేవిధంగా టన్నెల్–1 లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలలో టన్నెల్–2లో 7 కి.మీ లైనింగ్ కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం అని, మిగిలిన 1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో హైకోర్టు ఆదేశాలతో టన్నెల్–2 లో చిక్కుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ వెలికితీత పనులు చేపట్టి, మొత్తం 7 కంపార్ట్మెంట్ లలో ఇప్పటికి 3 కంపార్ట్ మెంట్లు బయటకు తీసుకొచ్చాం అని టన్నెల్ బోరింగ్ మెషిన్ లో క్లిష్టమైన హెడ్ ను అక్కికక్కడే టన్నెల్ లోనే పూడ్చిపెట్టడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్ లో 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ పనులు, జనవరిలో ప్రారంభించి నేటికి 5 నెలల్లో పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల, నత్తనడకన సాగుతున్న 21 కి.మీ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. మెంధా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్ లో పడిన భారీ గండికి సిసి వాల్ నిర్మించి పూర్తి చేయబోతున్నాం అని అన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్స్ తో పాటు పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు సైతం జూన్ నెలాఖరు నాటికి పూర్తికానున్నాయి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, సీజన్ మొదలయ్యే నాటికి నల్లమలసాగర్ రిజర్వాయర్ నింపేలా పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్ బాబు, ఎస్. ఈ అబూతలేం, ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుల భూములకు రక్షణ కల్పించాలి

- బడే సులోచనపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కు రైతుల వినతి
- 1965 నుంచి సాగులో ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన



**ఏటూరు నాగారం(ప్రశ్న న్యూస్)** ఏటూరు నాగారం మండలం ఆకలవారి గణపురం 209 సర్వే నంబర్‌లో 1965 నుంచి సాగు చేసుకుంటున్న తమ భూములను కొంతమంది ఆదివాసీలు అక్రమంగా కబ్జా చేసి గుడిసెలు వేస్తున్నారని రైతులు ఆరోపించారు. సోమవారం మాచర్ల వెంకటేశ్వర్లు, ఫయాజ్, సరి కొప్పుల శ్రీనివాస్ తదితర రైతులు ఐటీడీఏ పీఓకు వినతిపత్రం సమర్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐటీడీఏ ఉద్యోగి అయిన బడే సులోచన భూములు కబ్జా చేస్తూ రైతులను బెదిరిస్తోందని ఆరోపించారు. సులోచనతో పాటు పలక గంగ, బొల్లం సారయ్య, గొంది గౌరమ్మ, శమంతకమణి సభ్యులంతా ముఠాగా ఏర్పడి రాత్రికి రాత్రే రైతుల భూముల్లో షెడ్లు వేసి "ఈ భూమి మాదే" అంటూ దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. చుట్టుపక్క మండలాల నుంచి గిరిజనులను తీసుకొచ్చి ఉద్దేశపూర్వకంగా గిరిజన భవన్‌లో ఉంచి, వారిని భూముల మీదికి పంపుతున్నారని తెలిపారు. "మేము కూడా పేదలమే. ఆ భూములను నమ్ముకొని బతుకుతున్నాం. మా భూములకు రక్షణ కల్పించి న్యాయం చేయండి" అని రైతులు ఐటీడీఏ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. "1965 నుంచి సాగు చేసుకుంటున్న మా భూముల్లోకి వచ్చి షెడ్లు వేస్తున్నారు. మేము కూడా పేద రైతులమే, మాకు న్యాయం చేయాలి" – బాధిత రైతులు



### 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష సినిమా..

# ఇప్పుడు విడుదలకు రెడీ!

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష గురించి ఎంత చెప్పినా తక్కువే. హారర్, కామెడీ, క్రైమ్, లేడీ ఓరియంటెడ్.. ఇలా ఏ జోనర్ అయినా తన మార్క్ నటనతో మెప్పిస్తూ దశాబ్దాలుగా అగ్రశ్రేణి హీరోయిన్‌గా రాణిస్తోంది. అయితే, ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో జరిగిన కీలక మార్పులు, ముఖ్యంగా దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరుణంలో.. విజయ్‌తో త్రిష రిలేషన్ గురించిన రూమర్స్ సోషల్ మీడియాలో ఏ రేంజ్‌లో వైరల్ అయ్యాయో మనందరికీ తెలిసిందే. ఈ పొలిటికల్, పర్సనల్ బజ్ వల్ల తమిళనాడు మార్కెట్‌లో త్రిష క్రేజ్ ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ఇప్పుడు ఇదే క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు.. ఏకంగా 12 ఏళ్లుగా ల్యాబ్‌కే పరిమితమైన త్రిష పాత సినిమాను థియేటర్లలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్రిష, అరవింద్ స్వామి లీడ్ రోల్స్‌లో నిర్మల్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'శతురంగ వెట్టై-2'. నిజానికి ఈ సినిమా షూటింగ్ 2014లోనే పూర్తయింది. కానీ ఆ సమయంలో నిర్మాతలకు ఎదురైన తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ రిలీజ్ కాకుండా అటకెక్కింది. ఇన్నేళ్లపాటు ఈ సినిమాను ఎవరూ పట్టించుకోలేదు. కానీ, ప్రస్తుతం తమిళనాడులో త్రిషకు ఉన్న విపరీతమైన క్రేజ్, పొలిటికల్ కనెక్టివిటీ నేపథ్యంలో.. ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను థియేటర్లలోకి వదిలితే కచ్చితంగా భారీ కలెక్షన్స్ రాబట్టవచ్చని చిత్ర బృందం గట్టిగా అంచనా వేస్తోంది. అందుకే 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 'శతురంగ వెట్టై-2'ను రిలీజ్ చేసేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

## స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది – సమంత



స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు.

'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను.

ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు. "అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది.
తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి



యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.
కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖ కీలక పాత్ర పోషించింది.

## విజయ్ దేవరకొండ సినిమాలో హాలీవుడ్ నటుడు




టాలీవుడ్‌లో హైలీ యాంటిసిపేటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటైన 'రణబాలి' నుంచి మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ వచ్చేసింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'ది మమ్మీ' సిరీస్‌లో ఇమ్‌హోటెప్ పాత్రతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆర్నాల్డ్ వోస్లూ భారతీయ సినిమా రంగంలోకి అడుగుపెడుతున్నట్టు అతని బర్త్‌డే సందర్భంగా చిత్ర బృందం ఈ సమాచారాన్ని వెల్లడించింది. చిత్రంలో ఆర్నాల్డ్ వోస్లూ అత్యంత క్రూరమైన నెగెటివ్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర పేరు 'సర్ థియోడర్ హెక్టర్' ఈ పాత్ర తీవ్రతను సూచిస్తూ చిత్ర బృందం ఆయనకు 'ది డెమోన్ ఆఫ్ డ్రాట్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌ను ఇచ్చింది.రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హై-బడ్జెట్ యాక్షన్ డ్రామాను మైత్రీ మూవీ మేకర్స్ మరియు టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ సంగీత ద్వయం అజయ్-అతుల్ సంగీతం అందిస్తుండగా, నిరవ్ షా సినిమాటోగ్రఫీ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 'రణబాలి'ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. హాలీవుడ్ స్టార్ ఎంట్రీతో ఈ చిత్రం మీద అంచనాలు ఒక్కసారిగా స్కై హైకి చేరాయి.

## తమిళ పొలిటికల్ థ్రిల్లర్‌లో సునీల్..

తమిళ నటుడు ఆర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'అనంతన్ కాడు' నుంచి ఒక ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రముఖ తెలుగు నటుడు సునీల్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో సునీల్ 'సంపత్ రావు' అనే పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ మేరకు ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్ తమ ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది.జియెన్ కృష్ణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్టయిన 'లూసిఫర్', 'ఎంపురాన్' చిత్రాలకు రచయితగా పనిచేసిన మురళీ గోపి ఈ సినిమాకు కథ అందించడం విశేషం. మినీ స్టూడియోస్ బ్యానర్‌పై ఎస్ వినోద్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది. యాక్షన్ సన్నివేశాలతో పాటు, నేపథ్యంలో వినిపించే ఒక కవిత హీరో ఆర్య పాత్ర స్వభావాన్ని తెలియజేసేలా ఉంది. విధికి, కుట్రలకు భయపడని ఒక తిరుగుబాటు నాయకుడిగా ఆర్య పాత్ర ఉండబోతున్నట్లు టీజర్ సూచిస్తోంది.ఈ చిత్రంలో ఆర్య, సునీల్‌తో పాటు రెజీనా కసాండ్రా, నిఖిల విమల్, ఇంద్రాన్స్ వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, ఎస్ యువ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. భారీ తారాగణం, ప్రముఖ సాంకేతిక నిపుణులతో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు




## 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ వేడుకలో సమంత ఆసక్తికర వ్యాఖ్యలు

నటి, నిర్మాత సమంత రూత్ ప్రభు తన రాబోయే చిత్రం 'మా ఇంటి బంగారం' షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. ఈ సినిమాలో సంప్రదాయ చీరకట్టులో యాక్షన్ సన్నివేశాలు చేయడం తనకు ఎంతో సవాలుగా అనిపించిందని ఆమె తెలిపారు. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుక సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సమంత సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలను వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ చిత్రానికి బి.వి. నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. 2019లో వచ్చిన 'ఓ బేబీ' తర్వాత సమంత-నందిని రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు.ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. చీరకట్టులో ఉంటూనే తీవ్రమైన పోరాట సన్నివేశాల్లో నటించడం క్లిష్టమైన అనుభవమని పేర్కొన్నారు. ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీలక్ష్మి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించగా, అడ్వాన్స్ బుకింగ్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. జూన్ 18న ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రీమియర్ షోలను ప్రదర్శించి, జూన్ 19న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



### ఉద్యమ సారథి పాతూరి సుధాకర్ రెడ్డికి

# మన జన్మదిన శుభాకాంక్షలు

**- బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు**





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా ఆవిర్భావ ఉద్యమ సారథి, బీజేపీ రాష్ట్ర నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి 62వ జన్మదిన వేడుకలు గురువారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లవంగు శ్రీకాంత్ (బీజేపీ మేడ్చల్ జిల్లా కోశాధికారి), సాకరబోయిన వెంకటేష్ ముదిరాజ్ (బీజేపీ మున్సిపల్ కార్యవర్గ సభ్యుడు), పోతుల హరిబాబు రెడ్డి, కానుగంటి వంశీ (మున్సిపల్ ప్రధాన కార్యదర్శి), మామిడి నర్సింగ్ రజక, జాకేట బాబురాజ్ కానుగంటి భరత్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మేడ్చల్ జిల్లా సాధన కోసం పాతూరి సుధాకర్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన నిరంతరం ముందుండి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత సేవ చేసేలా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**- భారీ సంఖ్యలో రక్తాన్ని దానం చేసిన మిమ్స్ విద్యార్థులు, సిబ్బంది**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లాలోని ఘన్ పూర్ లో ని మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. తమ వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, పని చేస్తున్న సిబ్బందికి రక్తదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటూ సంస్థ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందుకోసం హాస్పిటల్ లో మూడు రోజులుగా వీరందరికీ ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడమే కాకుండా వారిని రక్తదానానికి ప్రోత్సహించారు. ప్రేరణ పొందిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని నేడు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో వైద్య విద్య, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో చదువుకొంటున్న విద్యార్థి, విద్యార్థిణులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. అంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి ఉచితంగా బ్లడ్ గ్రూప్ , హిమోగ్లోబిన్ , హెచ్ఐవి , హెపటైటిస్ -బి ,హెపటైటిస్ - సి , సిఫిల్, మలేరియా మొదలైన పరిక్షలు చేశారు. అనంతరం వీరి ద్వారా హాస్పిటల్ లో చికిత్సకు వచ్చే రోగులకు ఉపయోగపడేలా వివిధ బ్లడ్ గ్రూపుల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించి భద్రపరిచారు. ఈ సందర్భంగా మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డా. మాన్విత సింధు మాట్లాడుతూ రక్తదానం పై పలు అపోహలు చలామణిలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా దానం చేసిన వారు నీరస పడిపోతారని, వారి శరీరంలో రక్తం తగ్గిపోతుందని, రోగ నిరోధక శక్తి కోల్పోయే ప్రమాదం ఉందనే అపోహలు పూర్తిగా అవాస్తమని వివరించారు. రక్తదానం శరీరాన్ని మరింత ఆరోగ్యవంతంగా చేస్తుందని అలానే మరొక విలువైన ప్రాణాన్ని కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని అందరూ గ్రహించాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ తరపున సర్టిపికేట్ లు అందజేశారు. మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ లోని పాథాలజీ విభాగపు అధిపతి డా. రాజశేఖర రెడ్డి నేతృత్వంలో బ్లడ్ బ్యాంకు ఇన్చార్జి డా. మాన్విత సింధు ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు సిబ్బంది శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఐ ఎం ఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కే శివరామకృష్ణ వారితో పాటూ , ఎంఐఎంఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేందర్ సింగ్ నేగి డా. గీత, ఇతర వైద్యులు, వైద్య వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను: ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి(ప్రశ్నా న్యూస్)** రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, ఒక బాధ్యతాయుతమైన హోంమంత్రి పదవిలో ఉన్న దళిత మహిళను, ఆమె పనితీరుపై కాకుండా ఆమె మేకప్ ను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో హుందాగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అంత అసహనం ఇదేనా మీ సామాజిక న్యాయం నాడు ఐటీ శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తేలేక, ఐటీ అంటే ఏంటో కూడా తెలియక ఏమీ చేతకాని దద్దమ్మలా మిగిలిపోయిన అమర్నాథ్ ఈరోజు ఒక మహిళా ప్రజాప్రతినిధి రూపురేఖలపై మాట్లాడటం అతని వంకర బుద్ధికి, రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. నాడు చంద్రబాబు నాయుడు కుటుంబంలోని మహిళలను అసెంబ్లీలో అవమానించినప్పుడే వైసీపీ సంస్కృతి ఏంటో రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైంది. కూటమి ప్రభుత్వంలో చట్టం ఎవరికీ చుట్టం కాదు తప్పు చేస్తే సొంత పార్టీ వారినైనా ఉపేక్షించకుండా యాక్షన్ తీసుకునే దమ్మున్న నాయకత్వం మనది. తప్పు చేసిన కోనేటి ఆదిమూలంను తక్షణమే సస్పెండ్ చేశాం, జగన్ ఇంటి మహిళలపై పోస్ట్ పెట్టిన కిరణ్ కుమార్‌ను అరెస్ట్ చేయించాం మహిళల రక్షణ కోసం శక్తి యాప్ జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. హోంమంత్రి అనిత పై చేసిన వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి, మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించే ప్రసక్తే లేదు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలా ఆనంద్ కుమార్ కూటమి ప్రభుత్వం టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదుపరులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి మాత ఆలయాన్ని సందర్శించిన ఆర్యవైశ్య నాయకులు

**- మరో పెనుగొండ క్షేత్రంగా గజ్వేల్ వాసవి మాత ఆలయం - ఎన్ సి రాజమౌళి**



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో నిర్మాణంలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఆర్యవైశ్య నాయకులతో కలిసి సందర్శించిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్ సి రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అనుగ్రహం అందరి పై ఉండాలని కోరుకుంటూ గజ్వేల్ లో శరవేగంగా నిర్మాణంలో ఉన్న శ్రీ కమలం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరుకుంటూ ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉంటుందని, ఇంకా ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అవసరమని అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసే వారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరుకుంటూ, గత ప్రభుత్వం హయాంలో వైశ్య భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో వైశ్య భవనం పక్కన అత్యంత సుందరంగా శ్రీ కమలం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం కొనసాగుతుందని త్వరలోనే ఆలయం నిర్మాణం పూర్తవుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కౌన్సిలర్ గోలి మమత సంతోష్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ది బిక్షపతి, ఏఎంసి డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్, కైలాస ప్రభాకర్, లయన్ నేతి శ్రీనివాస్, ఎన్ సి సంతోష్, ఎర్రం శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, రావికంటి చంద్రశేఖర్, జూలూరు రంగయ్య, సూర ఆంజనేయులు, ఉప్పల కృష్ణమూర్తి, దుబకుంట ప్రభాకర్, నేతి సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## సెయింట్ క్లారిటీ ఎస్ ఎస్ సి విద్యార్థులకు సన్మానం




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి బాసు రేగడి గ్రామంలోని సెయింట్ క్లారిటీ హైస్కూల్లో ఉత్తమ ఫలితాలతో పాసైన ఎస్ ఎస్ సి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సెయింట్ క్లారిటీ విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈశ్వరచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఫస్ట్ క్లాస్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత గరిసెల సురేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు మారేపల్లి సుధాకర్ మారేపల్లి ,పసల ఫిలిప్ స్వాతి రెడ్డి, కోమలత, మరిలమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ జేమ్స్, ఫాదర్ బెన్నీ, ఫాదర్ ప్రశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈశ్వరచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11 మంది విద్యార్థులకు నగదు రూపంలో బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంచి స్థాయిలో ఉద్యోగాలు సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వారు విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అత్యధిక మార్కులు వచ్చిన అక్షరను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే వివిధ సబ్జెక్టులలో అత్యధిక మార్కులు సాధించిన సబ్జెక్ట్ టాపర్లకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల కృషిని, పట్టుదలను అతిథులు ప్రశంసించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించడమే కాకుండా, భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్ఫూర్తినిచ్చింది.

### వైసిపి అరాచకానికి

# అమరుడైన అమర్నాథ్ గౌడ్




**శ్రీకాళహస్తి (ప్రశ్నా న్యూస్)** బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆత్మ బంధువులైన బిసి వర్గాలకు చెందిన వారిపై కక్ష పెంచుకున్న వైసిపి అరాచకానికి అమర్‌నాథ్ గౌడ్ అమరుడయ్యాడని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల అరాచకానికి అశువులు బాసిన అమర్నాథ్ గౌడ్ మూడవ వర్ధంతి సందర్భంగా ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలుడి చిత్రపటానికి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పసి పిల్లాడిని కూడా చూడకుండా పెట్రోల్ పోసి తగలబెట్టేసిన వైసీపీ దుర్మార్గానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. అమర్నాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను. వైసిపి సైకోల దాష్టీకానికి బలైన ఎంతోమంది అమరులలో అమర్‌నాథ్ గౌడ్ మరణం చాలా బాధాకరమైనది అని, వైసిపి నాయకులు తన అక్కను వేధింపులకు గురి చేయడాన్ని చూసి తట్టుకోలేక ప్రశ్నిస్తే, జూన్ 15, 2023 న బడికి వెళ్తున్న 15 సంవత్సరాల అమర్‌నాథ్ గౌడ్ ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేసి చిన్నారి ప్రాణాలను చిన్న వయసులోనే చిదిమేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరథాచారి, యం.సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యం.రవి., రెడ్డివారి గురవారెడ్డి, కామేష్ యాదవ్, కొట్టే సాయి, విజయకుమార్, నాగరాజు నాయుడు, కృష్ణయాదవ్, మునిరాజా నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, శ్రీమతి రేణుకా దేవి, బిజెపి నాయకులు చంద్రప్ప, డా.యం.ఉమేష్ రావు, వజ్రం కిషోర్, కె.వి.ప్రతాప్, బుజ్జి, జయప్రకాష్, కోట చంద్రశేఖర్, మునిరాజా యాదవ్, బీమాల భాస్కర్, చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

### మల్కాజ్‌గిరిలో అక్రమ హుక్కా సెంటర్లపై

# పోలీసుల ఉక్కుపాదం

**- నాలుగు కేసులు నమోదు.. ఏడుగురు అరెస్ట్**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్లు, కేఫ్‌లపై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ 15న చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 14 హుక్కా సెంటర్లు, కేఫ్‌లను ఎస్ఓటి పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నాలుగు సంస్థలపై కేసులు నమోదు చేశారు. అలాగే అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. హుక్కా సెంటర్ల నిర్వహణ వల్ల ప్రజారోగ్యానికి, శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని మల్కాజ్‌గిరి పోలీసులు పేర్కొన్నారు. కేఫ్‌లు, హుక్కా సెంటర్ల నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే వ్యాపారాలు నిర్వహించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సామగ్రిని స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అక్రమ హుక్కా సెంటర్లు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ ప్రత్యేక దాడులు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పర్యవేక్షణలో, ఎస్ఓటీ ఇన్‌ఛార్జ్ డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గజ్వేల్‌కు చెందిన విద్యార్థి టి. జ్ఞానేశ్వర్ ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నికత్ అంజుమ్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్వర్‌ను అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వాన్ని కూడా పెంపొందిస్తాయని అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంను కేవలం 12 సెకండ్లలో పూర్తి చేసి ద్వితీయ స్థానం సాధించడం విశేషమని, జ్ఞానేశ్వర్ కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడా విభాగం బాధ్యులు ఆర్. మహేందర్ రెడ్డితో పాటు అధ్యాపక బృందం సభ్యులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపికైన సందర్భంగా కేంద్రీకృత వంటగది నిర్మాణానికి గాను స్థల సేకరణ నిమిత్తం ఆలియాబాదు, కేశవరం లోని మూసిఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే విధంగా ఉండేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి గాను స్థల పరిశీలనకై శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలోని హాస్టల్స్ ను తనిఖీ చేశామన్నారు. ఈ హాస్టల్స్ ఎప్పటి నుండి మూసి ఉన్నాయని, ఎంత స్థలం ఉందని బిసి వెల్ఫేర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టల్స్ స్థల వివరాల నివేదికను తనకు అందజేయాలని సంబంధిత ఎంఆర్ఓలకు సూచించారు. అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. విద్యార్థులు ఎంత మంది హాజరైనారని సంబంధితగ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికొత్త అడ్మిషన్లు అయ్యాయని అడిగారు. పిల్లలతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఆడుకోవడానికి పరికరాలు ఉన్నాయా, ఏమైనా కావాలా అని విద్యార్థులను అడుగగా, ఫుట్ బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ అందిస్తామన్నారు. ఈ పర్యటనలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్ పేట్ ఎంఆర్ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ ఇద్రీస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు ఎజెన్సీ మన్న ట్రస్ట్ వారితో కలెక్టర్ మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకొని అవసరమైన సలహాలు సూచనలు అందజేసారు.

# విద్యుత్ వెలుగుల వెనుక కనిపించని కష్టజీవులు

## - సమాజానికి నిశ్శబ్ద సేవలందిస్తున్న విద్యుత్ యోధులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రతిసారి ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది విద్యుత్ శాఖ సిబ్బందే. ఎండాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు, వర్షాకాలంలో చెట్లు కూలి తీగలు తెగిపోవడం, చలికాలంలో నిర్వహణ పనులు ఇలా ఏ కాలమైనా విద్యుత్ సిబ్బందికి సవాళు తప్పవు. అయినప్పటికీ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో వారు రాత్రింబవళ్లు శ్రమిస్తూనే ఉంటారు. వారి సేవలకు తగిన గుర్తింపు, భద్రతా సౌకర్యాలు, ప్రోత్సాహం అందించడం సమాజం బాధ్యతగా పలువురు అభిప్రాయపడుతున్నారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం మేడ్చల్ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెట్టగా, అదే సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంకితభావం మరోసారి వెలుగులోకి వచ్చింది. వర్షం కారణంగా పలుచోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. అనేక కాలనీలు చీకట్లో మునిగిపోగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖ సిబ్బంది మాత్రం విశ్రాంతిని పక్కనపెట్టి రాత్రి నుంచే రంగంలోకి దిగారు. కురుస్తున్న వర్షాన్ని, చీకటిని, ప్రమాదాలను లెక్కచేయకుండా దెబ్బతిన్న విద్యుత్ లైన్లను మరమ్మతు చేస్తూ, చెట్లను తొలగిస్తూ సరఫరా పునరుద్ధరణ కోసం శ్రమించారు. ప్రజలకు త్వరితగతిన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో గంటల తరబడి కష్టపడి పనిచేశారు. విద్యుత్ సిబ్బంది చేసే పని సాధారణమైనది కాదు. విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య పనిచేయడం



ఎప్పుడూ ప్రమాదకరమే. వర్షాకాలంలో ఈ ప్రమాదం మరింత పెరుగుతుంది. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను తగ్గించాలనే ఉద్యోగ బాధ్యతతో వారు తమ విధులను నిర్వర్తిస్తుంటారు. కుటుంబాలకు దూరంగా, విశ్రాంతి లేకుండా, అనేక సవాళ్లను ఎదుర్కొంటూ పనిచేసే ఈ సిబ్బంది సేవలు నిజంగా ప్రశంసనీయమైనవి. అయితే వారి కృషికి తగిన గుర్తింపు దక్కడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చాలావరకు అధికారులను ప్రశంసిస్తారు కానీ నిత్యం శ్రమించే సిబ్బందిని ప్రశంసించే నాధుడే లేకుండా పోయాడు. అధికారులు అన్ని విధాలా సేఫ్ సైడ్ ఉండి సిబ్బందితోనే పనులు చేయిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే అయినా సిబ్బందికి ఆశించిన స్థాయిలో



ఆదరణ లేకపోవడం దురదృష్టమే. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు మాత్రమే వారి అవసరం గుర్తుకు వస్తుందని, సమస్య పరిష్కారమైన తర్వాత వారి సేవలను చాలామంది మరిచిపోతారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలకు వెలుగులు అందించేందుకు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న విద్యుత్ కార్మికుల సేవలను గుర్తించి అభినందించాల్సిన అవసరం ఉందని తెలుపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, తుఫానుల సమయంలో ప్రజల జీవితాలు సజావుగా కొనసాగేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవి. అలాంటి ఉద్యోగులకు తగిన భద్రతా పరికరాలు, ప్రోత్సాహకాలు, సామాజిక గుర్తింపు కల్పించడం ప్రభుత్వంతో పాటు సమాజం బాధ్యత కూడా. ప్రజల ఇళ్లలో వెలుగులు నింపే ఈ నిశ్శబ్ద సేవకుల కృషికి గుర్తింపు లభించినప్పుడే వారి సేవలకు నిజమైన గౌరవం దక్కినట్టవుతుందని "ప్రజాప్రశ్న" దినపత్రిక కోరుతుంది.

# అస్తవ్యస్తమైన టౌన్ ప్లానింగ్ వ్యవస్థ గాడిలో పడేనా.?

**- కొత్త టౌన్ ప్లానింగ్ అధికారుల రాకతో ఆశలు - ఇకనైనా అక్రమ కట్టడాలకు బ్రేక్ పడేనా.? - కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిహెచ్ఎంసి కార్యాలయం తో పాటు, ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం పరిధిలో అస్తవ్యస్తంగా మారిన పట్టణం.. కొత్త టౌన్ ప్లానింగ్ అధికారుల రాకతోనైనా పట్టణ వ్యవస్థ గాడిలో పడేనా అని పట్టణవాసులు ఆశపడుతున్నారు. అక్రమం కట్టడాలు, అక్రమంగా వెలిసిన వెంచర్ల తో అస్తవ్యస్తంగా మారిన పట్టణాలు కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులతో మార్పు వచ్చేనా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇంతకాలం మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం ఉన్న ఇంచార్జి టౌన్ ప్లానింగ్ అధికారి ఒకటి రెండు రోజులు మర్చిపోవడం తో పట్టణంలో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. సేమ్ ఎల్లంపేట మున్సిపల్ లో సైతం ఇదేవిధంగా ఉంది. అయితే ఇటీవల మేడ్చల్ సర్కిల్ కు పూర్తిస్థాయి ఏసిపి రావడం... ఎల్లంపేట మున్సిపాలిటీకి కొత్త టౌన్ ప్లానింగ్ అధికార రావడం తో పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

### మేడ్చల్ సర్కిల్‌లో..

రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ పట్టణానికి ఇంతకాలం పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడం వల్ల టౌన్ ప్లానింగ్ అస్తవ్యస్తంగా ఉండేది. అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపట్టిన చర్యలు తీసుకోవడంలో అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు వెనుకడుగు వేసేవారు. దీంతో మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ ఇతర ప్రాంతాలలో జోరుగా అక్రమ కట్టడాలు వెలిశాయి. ఇదేవిధంగా జోరుగా వెంచర్లను సైతం ఎలాంటి అనుమతులు లేకుండానే ఏర్పాటుచేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారు. ప్రస్తుతం మేడ్చల్ సర్కిల్ కార్యాలయానికి పూర్తిస్థాయి అసిస్టెంట్ సిటీ ప్లానర్ ( ఏసిపి ) భాస్కర్ గౌడ్ రావడంతో అక్రమ కట్టడాలు, అక్రమ వెంచర్ల కు పులిస్టాప్ పడనున్నాయని స్థానికులు భావిస్తున్నారు.

### ఎల్లంపేట మున్సిపల్...

ఎల్లంపేట మున్సిపల్ లో సైతం అక్రమ కట్టడాలకు, అక్రమ వెంచర్లకు డోకా లేవు. ఇక్కడ సైతం అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించారు. దీంతో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలిశాయి. ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం చుట్టే అనుమతులు ఒక రకంగా తీసుకొని నిర్మాణాలు మరో రకంగా చేపడుతున్న భవనాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడికి కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ చంద్రకాంత్ తో అక్రమ కట్టడాలకు బ్రేక్ పడతాయని స్థానికులు భావిస్తున్నారు.

### కొత్త ఏసిపి, కొత్త టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు

మేడ్చల్ సర్కిల్ కార్యాలయం తో పాటు ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయానికి కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులకు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ తోపాటు ఎల్లంపేట మున్సిపాలిటీలో సరిదిద్దాల్సిన కట్టడాలు ఎన్నో ఉన్నాయి. కొన్నిటి వెనుక రాజకీయ నాయకుల అండ ఉండగా.. మరికొందరు చట్టాన్ని లైట్ గా తీసుకొని అక్రమ నిర్మాణాలను చేపట్టిన ఘటనలు



ఉన్నాయి. వాటిని సరి చేయాలంటే కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులకు కత్తి మీద సామి అయ్యే అవకాశాలు ఉన్నాయి. చూడాలి కొంత టౌన్ ప్లానింగ్ అధికారులతో మాకు వచ్చేనా.

# అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

**- తిరిగి ప్రారంభం కానున్న హర్మూజ్ జలసంధి రవాణా**



**దోహా (ప్రశ్న న్యూస్)** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది. 2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు. ?

# ఫీజుల దోపిడీ.. భగ్గుమన్న ఏబీవీపీ

**- హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ప్రపంచంలో అత్యంత కాలుష్య దేశం.. పాకిస్తాన్

**- తాజాగా విడుదలైన 'ఐక్యూఎయిర్' నివేదిక**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచంలోనే అత్యంత కాలుష్య దేశంగా పాకిస్థాన్ నిలిచింది. స్విట్జర్లాండ్‌కు చెందిన వాయు నాణ్యత పరిశోధనా సంస్థ 'ఐక్యూఎయిర్' విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దేశంలో సగటు పీఎం2.5 స్థాయి 67.3 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్‌గా నమోదైంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించిన పరిమితి ఐదు మైక్రోగ్రాములతో పోలిస్తే దాదాపు 13 రెట్లు ఎక్కువ. 'ఐక్యూఎయిర్' నివేదిక ప్రకారం బంగ్లాదేశ్ (66.1), తజికిస్థాన్ (46.3), చాద్ (45.4), డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (40.8) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 38.2 మైక్రోగ్రాముల పీఎం2.5 స్థాయితో భారత్ ఆరో అత్యంత కాలుష్య దేశంగా నమోదైంది. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ రంగం, పంట వ్యర్థాల దహనం, గృహ అవసరాలకు బయోమాస్ ఇంధనాల వినియోగం వంటి అంశాలు కాలుష్యానికి ప్రధాన కారణాలుగా నివేదిక పేర్కొంది. ముఖ్యంగా దక్షిణాసియా దేశాలు ప్రపంచంలోనే అత్యంత అధ్వాన వాయు నాణ్యత సమస్యను ఎదుర్కొంటున్నాయని వెల్లడించింది. అత్యంత సూక్ష్మమైన పీఎం2.5 కణాలు నేరుగా ఊపిరితిత్తులు, రక్తప్రసరణ వ్యవస్థలోకి చేరి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాము పరిశీలించిన దేశాల్లో 91 శాతం దేశాలు డబ్ల్యూహెచ్ఓ సూచించిన గాలి నాణ్యత ప్రమాణాలను చేరుకోలేకపోయాయని ఐక్యూఎయిర్ నివేదిక వెల్లడించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588